క్లుప్తంగా

మర్యాద పూర్వక కలయిక



వైఎస్ జగన్‌తో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చవ్వాకుల సత్యనారాయణమూర్తి

వీరవాసరం: తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం పార్టీ మండల కన్వీనర్ చవ్వాకుల సత్యనారాయణమూర్తి మర్యాద పూర్వకంగా కలిశారు. బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన పార్టీ ఒక వైఎస్సార్ సీపీ మాత్రమే అని చవ్వాకుల అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది అయినా సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలందరినీ కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు.

ఘనంగా వీరాంజనేయ ఆలయ వార్షికోత్సవం



ఉండిలో వీరాంజనేయుని ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: స్థానిక సంతమార్కెట్‌లో వేంచేసియున్న వీరాంజనేయస్వామి 20వ వార్షికోత్సవాన్ని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద నుంచి ప్రారంభించిన ఊరేగింపు గ్రామంలోని ప్రధాన వీధుల్లో బుట్టబొమ్మలు, డీజే సౌండ్స్, బాణసంచా కాల్పులతో వైభవంగా స్వామివారిని ఊరేగించారు. గురువారం ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా మారెమ్మ ఆలయ వార్షికోత్సం



ప్రత్యేకాలంకరణలో మారెమ్మ

ఆకివీడు: స్థానిక గంగానమ్మ కోడు వీధిలోని దండు మారెమ్మ వారి ఆలయ మూడో వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతో అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు.

కోళ్లపర్రు మాజీ సర్పంచ్ మృతి



యండపల్లి రామారావు

ఆకివీడు: మండలంలోని కోళ్లపర్రు గ్రామ మాజీ సర్పంచ్ యండపల్లి రామారావు (74) బుధవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందారు. వాహనం అదుపు తప్పిన ప్రమాదంలో తలకు బలమైన గాయమైంది. శస్త్ర చికిత్స చేసిన తరువాత చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆయన మృతిపై ఏఎంసీ మాజీ చైర్మన్ వానపల్లి బాబూరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాల రత్నం, మద్రివాడ వెంకట్రావు, పాశం నర్సింహరావు తదితరులు సంతాపం తెలిపారు.

జూలై 5న జాతీయ లోక్ అదాలత్



న్యాయమూర్తి లక్ష్మీనారాయణ

భీమవరం: భీమవరంలో జూలై 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు భీమవరం మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం భీమవరంలో న్యాయవాదులతో ఏర్పాటుచేసిన ప్రత్యేకంగా సమావేశంలో ఆయన మాట్లాడారు. మోటారు వెహికల్ ఇన్సూరెన్స్ కేసులు 220 పెండింగ్‌లో ఉన్నాయని ఇన్సూరెన్స్ కంపెనీలు ముందుకు వస్తే ఎక్కువ కేసులు పరిష్కారమవుతాయన్నారు. జాతీయ లోక్ అదాలత్ మంచి అవకాశమని, ప్రతి రోజూ ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు న్యాయమూర్తి లక్ష్మీనారాయణ చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు నిమ్మల సత్యనారాయణ, నిమ్మల నవీన్, చక్రవర్తి, శ్రీనివాస్, సునీల్ కుమార్, రమేష్ పాల్గొన్నారు.

మండాలమ్మకు ముక్కెర సమర్పణ

పెనుగొండ: వడలి గ్రామ దేవత మండాలమ్మకు రాజమహేంద్రవరానికి చెందిన గణపతి నీడి వెంకట కిశోర్, సుభాషిణీ దంపతులు బంగారు ముక్కెర సమర్పించారు. బుధవారం ఆలయ ప్రాంగాణంలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయ కమిటీ సభ్యులకు ఎనిమిది గ్రాముల ముక్కుపుడకను అందించారు.

స్లూయిజ్ నిర్మాణం పూర్తయ్యేనా?

- నత్తనడకన బందాల చేడు డ్రెయిన్ స్లూయిజ్ పనులు
- ఏటా ఉప్పునీటితో ఇబ్బందులు పడుతున్న రైతులు



దొంగపిండి గ్రామంలో బందాల చేడు శివారులో నిర్మించిన స్లూయిజ్

భీమవరం అర్బన్ : భీమవరం మండలంలోని దొంగపిండి గ్రామంలో బందాలచేడు డ్రెయిన్ శివారు ఉప్పుటేరులో కలిసే చోట నిర్మిస్తున్న స్లూయిజ్ పనులు ఏళ్లు గడుస్తున్నా నిర్మాణ పనులు పూర్తి కావడం లేదు. దీంతో ఈ ప్రాంతంలో కాంట్రాక్టర్, అధికారుల తీరుపై ఆక్వా రైతులు మండిపడుతున్నారు. బొండాడ డ్రెయిన్ కోటిమొగ నుంచి గూట్లపాడు, కొత్తపూసలమర్రు, దొంగపిండి గ్రామాల మీదుగా ఉప్పుటేరులో కలుస్తుంది. ఉప్పుటేరు కలిసేచోట గత పదేళ్ల క్రిందట స్లూయిజ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ డ్రెయిన్ ఆనుకుని సుమారు 8 వేల ఎకరాల చేపలు, రొయ్యలు సాగు చేస్తున్నారు. ఏటా జనవరి నెలలో సముద్రం నుంచి ఉప్పునీరు రావడంతో ఈ డ్రెయిన్ ఆనుకుని సాగు చేస్తున్న భూములు చౌడు బారిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్లూయిజ్ నిర్మాణం చివరి అంకానికి వచ్చినా గత పదేళ్లుగా తలుపులు బిగించకపోవడంతో కోట్లాది రూపాయలు ఏటా నష్టపోతున్నామని ఆక్వా రైతులు చెబుతున్నారు.

నాలుగు దశాబ్దాలు క్రితమే స్లూయిజ్

ఉప్పుటేరు డ్రెయిన్ నుంచి ఉప్పునీరు ఈ మురుగు డ్రెయిన్‌లోకి రాకుండా 4 దశాబ్దాలు క్రితం అప్పటి ప్రభుత్వం ఈ ప్రాంత రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని డ్రెయిన్‌కు మొగలో స్లూయిజ్ నిర్మించారు. ఈ స్లూయిజ్ కాలం చెల్లడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ స్లూయిజ్ బాగుంటే ఉప్పునీరు రాకుండా తలుపులు బిగించి, సప్పనీరు సముద్రంలోకి వెళ్లకుండా రైతులు జాగ్రత్తలు తీసుకుని వరి పంట సాగు చేయడంతో పాటు, చేపలు, రొయ్యలు పెంచేవారు. గత పదేళ్ల క్రితం డెల్టా ఆధునికీకరణ పనుల్లో భాగంగా నూతన స్లూయిజ్ నిర్మించేందుకు పనులు మొదలు పెట్టారు. స్లూయిజ్ వంతెన నిర్మించి తలుపులు అమర్చేందుకు తీసుకువచ్చినా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వల్ల ఇప్పటివరకు ఈ స్లూయిజ్ పనులు నిర్మాణం పూర్తి కాలేదు. ఆ తలుపులు తుప్పుపట్టి ధ్వంసమవుతున్నాయి. ఏటా ఉప్పుటేరు నుంచి బందాలచేడు డ్రెయిన్‌లోకి ఉప్పునీరు చొచ్చుకురకావడంతో కోట్లాది రూపాయలు నష్టపోతున్నామని ఈ ప్రాంత రైతులు వాపోతున్నారు.

ఉప్పు కయ్యలుగా మారుతున్నాయి.

జనవరి నుంచి వచ్చే ఉప్పునీరు రాకుండా స్లూయిజ్ తలుపులు దింపి అడ్డుకట్ట వేయడంతో ఆ డ్రెయిన్ పరిధిలోని పంటలను రక్షించుకొనేవారు. స్లూయిజ్‌లు నిర్మాణంలో ఉండటం వల్ల ఉప్పునీరు వచ్చి తీర ప్రాంత మంతా ఉప్పుకయ్యలుగా మారుతుందని రైతులు చెబుతున్నారు. అంతేకాకుండా ఈ స్లూయిజ్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో ఏటా కోట్ల రూపాయలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డ్రెయిన్ శాఖాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి స్లూయిజ్ నిర్మాణాన్ని పూర్తి చేసి ఈ ప్రాంత ఆక్వా రైతులను ఆదుకోవాలని కోరుకుంటున్నారు.

ఉప్పు కయ్యలుగా మారుతున్నాయి

నేను 4 ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. ప్రతి ఏటా జనవరి నుంచి ఉప్పునీరు వస్తుంది. గతంలో సప్పనీటి చేపలు పెంచేవాళ్లం మంచిదిగుబడులు వచ్చేవి. ఇప్పుడు స్లూయిజ్ శిథిలావస్థకు చేరుకోవడంతో ఉప్పునీరు వస్తుంది. ఉప్పునీటిలో చేపలు త్వరగా ఎదగవు, దిగుబడి కూడా సరిగ్గా రావు. సప్పనీరు లేక చేపలు, రొయ్యల సాగు చేయలేకపోతున్నాం. అంతేకాకుండా ఉప్పునీరు రావడం వల్ల చవుడు భూములుగా మారుతున్నాయి.

– ఆర్.బాలకృష్ణ, రైతు దొంగపిండి



తుప్పపడుతున్న తలుపులు



పూర్తయిన డ్రెయిన్‌పై స్లూయిజ్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప సబ్ స్టేషన్ పరిధిలో లోసరిలో నూతనంగా నిర్మిస్తున్న 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రమునకు గురువారం కొత్తగా 33 కేవీ లైన్లు ఏర్పాటు, వార్షిక మరమ్మతులు నిమ్మిత్తం గొల్లవానితిప్ప సబ్ స్టేషన్ నుంచి లోసరి వెళ్లే 11 కేవీ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. తోకతిప్ప, బరువానిపేట, గరవళ్లదిబ్బ, లోసరి, దెయ్యాల దిబ్బ, నాగేంద్రపురం, గ్రామాలతో పాటు ఆక్వా చెరువుల లైన్లకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వీరవాసరం: మండలంలోని కేవీ 33కొణితివాడ సబ్‌స్టేషన్‌కు భీమవరంనుంచి వేయి కొత్తలైన్ వేయ టం నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ అప్పారావు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యా హ్నం ఒంటి గంట వరకు కొణితివాడ, మడగుగు, పోలవరం, నేలపోగుల, పోలమూరు ఇండస్ట్రీయల్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ వెంకటేశ్వరరావు తెలిపారు.

29న పీసీసీ అధ్యక్షురాలి రాక

కాళ్ల: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఈనెల 29 తేదీన చేపట్టే భీమవరం పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్ రాజు పిలుపునిచ్చారు. మండలంలోని కాళ్లకూరులో ఉండి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి వేగేశ్న గోపాలకృష్ణంరాజు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఈ మేరకు ప్రకటన చేశారు.

యోగాతో మానసిక వికాసం

కాళ్ల: యోగ సాధన విద్యార్థుల్లో మానసిక వికాసాన్ని పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడుతుందని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఉన్నత భారత్ అభియాన్ విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ టి.రాంబాబు అన్నారు. బుధవారం కోపల్లె హైస్కూల్లో విద్యార్థులతో యోగా తరగతులు నిర్వహించారు. యోగా శిక్షకులు రమేష్ రాజు , వంశీ కృష్ణ, విద్యార్థులకు యోగాపై ప్రాక్టీస్ సెషన్‌లను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూబీఏ గ్రామ సమన్వయకర్తలు కేఎం గణేష్, జి.సూరిబాబు, జె.జీవన్ కుమార్, ఆర్.సుబ్బారావు, ఎస్.వీర్రాజు పాల్గొన్నారు.

కుముదవల్లిలో..

పాలకోడేరు: యోగాతో మానసిక ఒత్తిడి నుంచి విముక్తి లభిస్తుందని కుముదవల్లి సర్పంచ్ భూపతిరాజు వంశీకష్ణ రాజు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం కుముదవల్లి గ్రామంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ విజ్ఞాన వేదిక నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ నాణ్యమైన జీవితం యోగాతోనే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో యోగ గురువులు సత్యనారాయణ రాజు, వెంకటేశ్వరరాజు, రామరాజు పాల్గొన్నారు.



కోపల్లె హైస్కూల్లో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు



కుముదవల్లిలో సర్పంచ్ వంశీకృష్ణంరాజు ఆధ్వర్యంలో యోగాసనాలు నిర్వహిస్తున్న దృశ్యం

హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు



డ్రైవింగ్ స్కూల్ గురించి వివరాలు చెబుతున్న డిపో మేనేజర్ పీఎస్ సత్యనారాయణ మూర్తి

భీమవరం (ప్రకాశంచౌక్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు భీమవరం డిపో మేనేజర్ పీఎస్ సత్యనారాయణ మూర్తి తెలిపారు. బుధవారం భీమవరం ఆర్టీసీ డిపోలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తేలికపాటి లైసెన్స్ కలిగి ఉన్నవారికి ఏపీఎస్ ఆర్టీసీ శుభవార్త అని, భారీ వాహన రంగంలో డ్రైవర్ల కొరతను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్ సర్టిఫికెట్‌తో లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్‌ను హెవీ లైసెన్స్ గా పొందటానికి నిపుణులతో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. బ్యాచ్ కు 16 మందికి 32 రోజులపాటు శిక్షణ అందిస్తున్నామని, మొదటి బ్యాచ్ పూర్తి అయిన తరువాత రెండో బ్యాచ్ ప్రారంభమవుతుందన్నారు. శిక్షణకు లైట్ మోటర్ వెహికల్ లైసెన్స్ పొంది ఏడాది పూర్తి అయిఉండాలని, హెవీ వాహన లైసెన్స్ కొరకు ఎల్ఎల్ఆర్ తీసుకొని ఉండాలని, కనీస వయస్సు 20 సంవత్సరాలు దాటి ఉండాలని అన్నారు. త్వరలో డ్రైవింగ్ క్లాసులు ప్రారంభిస్తున్నామని అన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకు 73829 24754 కు సంప్రదించాలని అన్నారు. అసిస్టెంట్ మేనేజర్ వై సురేష్, ట్రైనర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో క్షయ వ్యాధి తగ్గుముఖం



ఆకివీడు సీహెచ్‌సీలో క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

ఆకివీడు: క్షయ వ్యాధి జిల్లాలో తగ్గుముఖం పడుతోందని జిల్లా క్షయ వ్యాధి నివారణాధికారి, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ భానూనాయక్ చెప్పారు. స్థానిక సీహెచ్‌సీలో బుధవారం క్షయవ్యాధి నివారణా వారోత్సవాల్లో భాగంగా వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రతి లక్ష మందిలో 250 మంది క్షయ వ్యాధిగ్రస్తులు ఉండేవారని, ప్రస్తుతం 150కి తక్కువగా ఉన్నారని చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం 1250 మంది రోగులు ఉన్నట్లు తెలిపారు. వారికి మందులు, వైద్యం, పరీక్షలు, పౌష్టికాహారంతో పాటు రూ.1000 నెలకు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం స్థానిక ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇన్‌చార్జి భువనను ఈ సందర్భంగా ఆయన సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు ఎండీ.నిజరిన్, సిబ్బంది పాల్గొన్నారు.

21న భీమవరం వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చినమిల్లి వెంకట్రాయుడు

భీమవరం: భీమవరం నరసయ్య అగ్రహారంలో ఈనెల 21వ తేదిన వైఎస్సార్ సీపీ భీమవరం నియోజవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ భీమవరం నియోజకవర్గ సమన్వకర్త చినిమిల్లి వెంకట్రాయుడు చెప్పారు. బుధవారం రాయలం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ, బొత్సా సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్ని నియోజక వర్గాల పార్టీ ఇన్‌చార్జ్‌లు, జిల్లా నాయకులు హజరవుతారని తెలిపారు. భీమవరం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి, నాయకులు, కార్యకర్తలందరినీ కలుపుకుని శక్తి వంచన లేకుండా చిత్తశుద్ధితో పని చేస్తానని వెంకట్రాయుడు చెప్పారు. 21న భీమవరం పట్టణం కుముదువల్లి రోడ్‌లోని కేఎస్ రాజు ఫంక్షన్ హాల్లో శనివారం ఉదయం 10 గంటలకు విస్తృత స్థాయి సమావేశంతో పాటు తాను నియోజకవర్గ సమన్వయకర్తగా ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విలేకర్ల సమావేశంలో పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాల, పార్టీనాయకులు మేడిద జాన్సన్, ఏఎస్ రాజు, కామన నాగేశ్వరరావు, గాదిరాజు రామరాజు, జిల్లా కొండయ్య, చవాకుల సత్యనారాయణ, కోడె యుగంధర్, పెనుమాల నర్సింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



ఎస్ఎఫ్ఐ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ దృశ్యం

భీమవరం: భారత విద్యార్థి ప్రదర్శన అఖిలభారత మహాసభ పోస్టర్‌ను బుధవారం భీమవరంలో ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర ఫలాలు అందరికీ దక్కాలంటే విద్య ద్వారా మాత్రమే సాధ్యమని భావించి విద్యాహక్కు కోసం పోరాటం చేయడానికి భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆవిర్భవించిందన్నారు. 18 ఎస్ఎఫ్ఐ భారత మహాసభలు కేరళ రాష్ట్రంలోని కూచిపూడిలో నిర్వహించనుండడం అభినందనీయమన్నారు. గత 55 ఏళ్లుగా ఎస్ఎఫ్ఐ దేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ విద్యారంగం బలోపేతం, విద్యారంగంలో వస్తున్న సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటాన్ని కొనసాగించాలని గోపీమూర్తి కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి గణేష్, టిప్రసాద్, పట్టణ అధ్యక్షుడు పి సాయికృష్ణ, బి సింధు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

భీమవరం: స్థానిక బుధవారం మార్కెట్ ప్రాంతంలో మైనర్ బాలిక అదృశ్యమైందంటూ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ఎస్‌వీవీ కృష్ణాజీ చెప్పారు. 10వ తరగతి వరకూ విద్యనభ్యశించి ఇంట్లోనే ఖాళీగా ఉంటున్న బాలికను ఏపని చేయడం లేదంటూ తల్లి మందలించడంతో మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయిందని చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోయిందంటూ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణాజి చెప్పారు.

సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన అవసరం



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): సీకిల్ సెల్ అనీమియా వ్యాధి ఎర్ర రక్త కణాలను ప్రభావితం చేస్తుందని, వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో పీఎం జన్‌మాన్ కార్యక్రమంలో భాగంగా సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలన మిషన్ అవగాహన సదస్సుకు జిల్లా రెవిన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల సెల్ అనీమియా వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అనంతరం 2047 నాటికి సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలన మిషన్ అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా వైద్య శాఖ అధికారి జి.గీతా బాయి, జిల్లా సహాయ వైద్యశాఖ అధికారి బి.భానునాయక్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి డి.లక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామాంజనేయరాజు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పుష్పరాణీ, డి ఎస్ ఎం ఓ వి.క్రాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కార్యవర్గ సమావేశం విజయవంతం చేయాలి

పెనుగొండ: హైదరాబాదులో ఈనెల 19న జరిగే వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జి గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. బుధవారం ఆచంటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికలాంగులకు పింఛన్ రూ.6 వేలు చేయించిన ఘనత మహాజననేత మందకృష్ణ మాదిగకు చెందుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చదలవాడ ముత్యాలరావు, ప్రసాదబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి తానేటి చినబుల్లియ్య మాదిగ, పైడియ మాదిగ, బత్తిన చిట్టిబాబు మాదిగ, కనపాల పెద్దిరాజు పాల్గొన్నారు.

పంట బోదెలపై ఆక్రమణలు తొలగించాలి



పంట బోదెలపై ఆక్రమణలు పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

వీరవాసరం: సార్వా సమీపిస్తున్న తరుణంలో వరి పంటలకు సాగునీరు అందకుండా కొణితివాడ రోడ్డు పోరంబోకు పాడవున ఉన్న పంట బోదెపై ఆక్రమణలు తొలగించాలని బుధవారం కొణితివాడకు చెందిన సుమారు వందమంది రైతులు ఆందోళనకు దిగారు. గత కొంతకాలంగా పంట బోదెపై పలువురు కొన్నిచోట్ల పంట బోదెలోపల నివాసానికి అనుకూలంగా ఆక్రమించి బోదెపై కల్వర్టర్ కట్టారు. ఇటీవల కాలంలో వరుసగా పంట బోదెపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న కొణితివాడ గ్రామస్తులు, రైతులు నిర్మాణాలు నిలిపివేయమని, తమ పంటలకు సాగునీరు అందించేందుకు ఇబ్బంది పడుతున్నామని పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తులు నిర్మాణదారుల్ని అడిగినప్పటికీ నిర్మాణాలు ఆపలేదు. ఈ తరుణంలో బుధవారం గ్రామస్తులు, పెద్దలు, రైతులు తహసీల్దార్‌కు ఫోన్ చేసి పంట బోదెపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఫోన్ చేసి సమస్యను వివరించారు. ఈ విషయానికి ఉత్తర పాలెం వీఆర్వో కడలి శ్రీనివాసరావును పంపిస్తానని తెలిపారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు ఉత్తర పాలెం విఆర్ఓ కడలి శ్రీనివాసరావుతో పాటు కొణితివాడ గ్రామస్తులు, రైతులు అక్రమ నిర్మాణాలు జరిగే ప్రదేశానికి వెళ్లారు. కొద్దిసేపు రైతులు, పెద్దలు ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ నిర్మాణాలు వెంటనే తొలగించాలని లేనిపక్షంలో తొలగిస్తామని విఆర్ఓ కడలి శ్రీనివాసరావుకు తెలిపారు. కొద్ది రోజుల వ్యవధిలోనే ఆక్రమణలు తొలగించాలని లేని పక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంలో కొణితివాడ గ్రామస్తులు, రైతులు, మాట్లాడుతూ ఈ పంట బోదె వెంబడి 130 ఎకరాలు వరి సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఈ అక్రమ నిర్మాణాలు కట్టడాల వలన తమ పంట బోదె ద్వారా సాగునీరు అందడం కష్టతరమవుతుందని వాపోయారు. వెంటనే ఈ ఆక్రమణలు తొలగించాలని విఆర్వో శ్రీనివాసరావును కోరారు.

భర్త ఇంటి ముందు భార్య ధర్నా

నరసాపురం రూరల్: మండలంలోని పాత నవరసాపురంలో తన భర్త, అత్త మామలు తనను వేధిస్తున్నారంటూ బుధవారం భర్త బర్రె శివశంకర్ ఇంటి ముందు భార్య దుర్గ భవాని ధర్నాకు దిగింది. తనది నరసాపురం మండలం పెదమైనవానిలంక గ్రామం అని నాలుగు నెలల క్రితం పాతనవరసపురం గ్రామానికి చెందిన వ్యక్తితో పెద్దల సమక్షంలో వివాహమైందని ఆమె పేర్కొన్నారు. అయితే కొన్ని రోజులుగా తనను ఇంట్లోకి రానియకుండా తాళంవేస్తూ బయటపడుకోబెడుతున్నారని ఆమె వాపోయింది. తనలో లోపాలు ఉన్నాయంటూ తన భర్తతో పాటు కుటుంబ సభ్యులు అవమానిస్తున్నారని ఆరోపించింది. తనను చంపేస్తామని బెదిరిస్తున్నారని బాధితురాలు వాపోయింది. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్టీసీ డీఎం ఎస్ సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ కార్గో సేవలు, కార్గో డోర్ డెలివరీ సేవలు, ప్రత్యేక బస్సులు, శుభకార్యాలకు బస్సుల ఏర్పాటు వంటి అంశాల్లో ఇబ్బందులు ఉండే సంప్రదించాలని కోరారు. అలాగే ఆర్టీసీ సేవలకు సంబంధించి సూచనలు స్వీకరించి పరిష్కరిస్తామని చెప్పారు. ఉదయం 11 గంటలు నుంచి 12 గంటలు వరకూ 99592 25486 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు.